ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శుక్రవారం 14 నవంబరు 2025



గూడెంలో భక్తుల సందడి

దండేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలను వదలిపెట్టారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకున్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

జన్నారం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): భూభారతిలో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య ఆదేశించారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యాయని ఇంకెన్ని పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మంచిర్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన అల్లాడి ప్రేంకుమార్ కుటుంబ సభ్యులకు మంచిర్యాల పెయింటర్ అసోసియేషన్ సంఘం నాయకులు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు మాచర్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఎండిరఫి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ బాబురావు తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు హర్షిత్‌బాబు, వినీల్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే వారంలో హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఇక పక్కాగా హద్దులు

- సర్వే నంబర్ల వారీగా భూముల మ్యాపింగ్
- జిల్లాల్లో ప్రయోగాత్మకంగా రీసర్వే
- రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ సమయంలోనే నక్షా రెడీ
- భూధార్ కార్డుల కోసం ఎంజాయ్‌మెంట్ సర్వే
- లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కొలతలు, హద్దులు


కొలతలపై శిక్షణ పొందుతున్న సర్వేయర్లు

నెన్నెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించింది. ఇందులో భాగంగానే రిజిస్ట్రేషన్-మ్యూటేషన్ సమయంలోనే భూమి నక్షా జత చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అవసరమైన మ్యాపుల రూపకల్పనకు, భూధార్ కార్డుల జారీకి ఎంజాయ్‌మెంట్ సర్వే చేసేందుకు పెద్ద ఎత్తున సర్వేయర్లు కావాలి. అందుకు సరిపడా ప్రభుత్వ సిబ్బంది లేక పోవడంతో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు వినియోగించుకోనున్నారు. జిల్లాలో 99 మంది అర్హులను గుర్తించి వారికి రెండు సార్లు శిక్షణ నిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవల వారందరు లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ధృవీకరణ పత్రాలు కూడా అందుకున్నారు. త్వరలో వారి సేవలు అందుబాటులోకి రానున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే భూములకు కొత్త నక్షాలతో పాటు వీరి సాయంతో జిల్లాలో పూర్తి స్థాయి రిసర్వే నిర్వహించనున్నారు. పూర్తిస్థాయి సర్వే కోసం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 12 గ్రామాలను ఎంపిక చేశారు. ఆధునిక పద్ధతులతో కొలతలు చేపట్టి హద్దులు గుర్తించి గ్రామకంఠం, అటవీ, సర్కారు తదితర భూములతో పాటు వ్యవసాయ భూములను సర్వే నంబర్ల వారిగా నక్షా, టిప్పన్ రూపొందించనున్నారు. దీంతో భవిష్యత్తులో భూమికి సంబంధించి ఎలాంటి వివాదాలు తలెత్తే అవకాశం ఉండదు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వ హించడానికి అవకాశం ఉటుంది.

దశాబ్దాలుగా సమస్యలు..

జిల్లాలో పట్టా భూములతో పాటు పోడు భూములు, అటవీ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ భూములు ఉన్నాయి. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూవివాదం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ అసైన్డ్ చేసి పట్టాలు జారీ చేస్తుండగా, ఆ భూములు రిజర్వు ఫారెస్టుకు చెందినవి అంటూ అటవీశాఖ అధికారులు సాగును అడ్డుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. రెవెన్యూ, ఫారెస్టు శాఖలు జాయింట్ సర్వే నిర్వహించాలనే డిమాండ్ దశాబ్దాల నుంచి ఉంది.

ఇంతే కాకుండా భూ భారతి చట్టం అమలు కోసం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో మార్పులు వంటి అంశాలు తెరపైకి వచ్చాయి. ప్రజావాణిలో భూసమస్యలపై పదుల సంఖ్యలో వినతి పత్రాలను అందిస్తూనే ఉన్నారు. భూములు, గ్రామాల రీసర్వేతో సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అధికారులంటున్నారు.

12 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు

రెవెన్యూలో అధిక శాతం సర్వేతో అనుసంధానమైన సమస్యలు ఉన్నాయి. సరిహద్దులు సరిగ్గా లేక పోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. జిల్లాలో వి విధ రెవెన్యూ గ్రామాలకు..

(తరువాయి 7లో)

పకడ్బందీగా..

ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం లాంటి వివరాలతో మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం ఆధారంగా రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేస్తున్నారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో భూమి వివరాలు ఏంటనేది తెలియడం లేదు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే మ్యాప్‌తో రి జిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆ సమాచారం అక్కడ సర్వేయర్‌కు వెలుతుంది. ఆ భూమిని సర్వే చేసి అందుకు తగ్గట్టు మ్యాప్ సిద్ధం చేసి మండల సర్వేయర్‌కు అందజేస్తారు. ఆయన దాన్ని పరిశీలించి ధృవీకరిస్తారు. అనంతరం ఆ నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్- మ్యూటేషన్ ప్రక్రియను తహసీల్దార్ రిజిస్టర్ చేస్తారు.

విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

కలెక్టర్ కుమార్ దీపక్


భీమారం కేజీబీవీలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్‌లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల భూకబ్జాలను అరికట్టాలి

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

బెల్లంపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని సంబంధిత రెవెన్యూ అధికారులు వాటిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే గడ్డం వినోద్ అండదండలతో కాంగ్రెస్ నాయకులు కబ్జాచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. మండలంలోని కన్నాల జాతీయ రహదారి పక్కనపెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు నామ మాత్రంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కాంగ్రెస్ నాయకులు అమ్మకానికి పెట్టినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఒక్కదానికి రూ.3లక్షలు వసూలు చేస్తున్నారని ఆడియో రికార్డింగ్ సంభాషణలు బయటికి వచ్చినా అధికారులు విచారణ చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డీఏవో హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తులసుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, టౌన్‌యూత్ ప్రెసిడెంట్ సబ్బని అరుణ్, నాయకులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే రిజర్వేషన్లు సాధ్యం

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న బీసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పార్టీలు, వ్యక్తులు కుల మతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధ్యమవుతాయని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ మైదానంలో బీసీ రిజర్వేషన్‌లపై చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తమిళనాడు తరహాలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధ్యపడాలంటే రాజ్యాంగ సవరణ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్‌చేశారు. రిజర్వేషన్‌ల చట్ట బద్దతకు విద్య, ఉద్యోగ, స్థానికత ఆధారంగా ప్రత్యేక జీవో ప్రభుత్వం చట్టబద్ధత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కర్రె లచ్చన్న, కర్ణ శ్రీధర్, రంగు రాజేశం, కనుకుంట్ల మల్లయ్య, జయరావు, రాజేశంగౌడ్, మల్లేష్, రమేష్, సదానందం, రవీందర్, ప్రకాష్, రాజన్న పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరుగుతూ..వివరాలు సేకరిస్తూ

జ్వరపీడిత గ్రామాల్లో పర్యటించిన జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం


చిక్రంగూడలో బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాపూర్, చిక్రంగూడ గ్రామాల్లో గురువారం జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు పర్య టించారు. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. చిక్రంగూడలో జ్వరంతో మృతి చెందిన చిక్రం నీలాబాయి, సోనాపూర్‌లో రక్తహీనతతో కుడిమేత అనురాధ మృతిచెందగా జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు పర్యటించి కుటుంబీకుల నుంచి వివరాలను సేకరించారు. డీపీహెచ్ఎన్ ఆర్ఎస్ పద్మ మాట్లాడుతూ చిక్రంగూడలో మృతిందిన నీలాబాయి పసరికల బారిన పడిందని, స్థానికంగా నాటు వైద్యాన్ని నమ్ముకుని ఆరోగ్యం విషమించి మృతిచెందిందన్నారు. సోనాపూర్‌లో మృతిచెందిన కుడిమేత అనురాధ అస్తమా, శ్వాస సంబంధిత వ్యాధితో పాటు ఫిట్స్ రావడంతో మంచిర్యాల మాతా శిశు కేంద్రంలో మెరుగైన వైద్యం అందించినప్పటికీ మృతిచెందినట్లు తెలిపారు. రక్తహీనత వల్ల బలహీన పడి మృతి చెందగా పుట్టిన బిడ్డ సైతం బలహీనంగా ఉండడంతో వైద్యులు ఇంక్యుబేటర్‌లో ఉంచగా ఫలితం లేకుండా పోయిందన్నారు. తల్లి, బిడ్డ మృతిచెందినట్లు తెలిపారు. రెండు గ్రామాల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధుల గురించి, కీటకాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. జ్వర పీడిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలను నిర్వహించాలని స్థానిక వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఎపిడిమాలిస్టు సుమన్, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ సంతోష్, పీహెచ్ఎన్ సరోజ, సిబ్బంది ఆకాంక్ష, శోబారాణి, సుజాత పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తితో మంచి దిగుబడి

-జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

నెన్నెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అధిక సాంద్రత విధానంతో పత్తి సాగు చేస్తే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు సాధించి లాభాలు గడించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫేసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని బొప్పారంలో గురువారం అధిక సాంద్రత పత్తి సాగు క్షేత్ర పరిశీలన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఏవో మాట్లాడుతూ తేలికపాటి నేలల్లో సైతం ఆధునిక పద్ధతిలో సాగు చేస్తే 30 శాతం దిగుబడి పెరుగుతుందన్నారు. పత్తిని రెండుమూడు సార్లు కాకుండా ఒకేసారి ఏరుకోవచ్చన్నారు. పంట తొందరగా చేతికి వస్తుందని, ఆ తర్వాత ఇతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. సేద్యశిభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ ఆధునిక పద్ధతిలో పత్తి సాగు విధానం, యాజమాన్య పద్ధతుల గూర్చి వివరించారు. అధిక మొక్కల వల్ల ఆశించిన దిగుబడులు పొందంతో పాటు నేలసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఖర్చులు సైతం చాలా వరకు తగ్గుతాయన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు మెడిక్యాటో పిచికారి గూర్చి వివరించారు. పోషక లోపాలు, కీటక, వ్యాధి లక్షణాల తేడాల గూర్చి చెప్పారు. సమగ్ర పోషక నిర్వహణ, యాంత్రిక పత్తి కోతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, సాధ్వి, మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన, ఏఈవో రామ్‌చందర్ పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్ల దరఖాస్తు తేదీని పొడిగించాలి


డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తు తేదీని పొడిగించాలని కోరుతూ గురువారం ఎంసీపీఐయూ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డీఏవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ మాట్లాడుతూ లబ్ధిదారులు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే వివిధ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉన్నాయన్నారు. పత్రాలు మంజూరు విషయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆలస్యం జరుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇళ్ల దరఖాస్తు తేదీని పొడిగించాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రమేశ్, నాయకులురామకృష్ణా,శ్రీనివాస్, సురేశ్‌లు పాల్గొన్నారు.

'చలో ఉట్నూర్' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

నస్పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివాసుల ధర్మ యుద్ధం చలో ఉట్నూరు సభ పోస్టర్లను గురువారం ఆదివా సీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ ఐక్య వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుడిమెత తిరుపతి మాట్లాడుతూ సభకు ఆదివాసులు ఆధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. చట్ట బద్దత లేని లంబాడలను ఎస్టీ జాబిత నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ బచావో, లంబాడా హటావో అనే ప్రధాన నినాదంతో మూడు దశాబ్ధాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. వలస వచ్చిన లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే ఏకైక డిమాండ్‌తో బహిరంగ సభ ఏర్పాటు చేసామన్నారు. ఈ సభకు ఆదివాసీ తొమ్మిది తెగల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు కలిసి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ సేన జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మడావి వెంకటేశ్, కోయ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలం బాపు, తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వల్క చిలుకయ్య, కోలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం మహేష్, ఆదివాసీ సేన కాసీపేట మండల ఉపాధ్యక్షుడు ఆత్రం సంజీవ్, ఆదివాసీ చెంచు సంఘం జిల్లా అధ్యక్షుడు కింనేర నరేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



మెడికల్ కాలేజీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులు

హాజీపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజా నికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల కు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తామని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుంచి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదన గుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. పీడియాట్రిషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసు కుంటామని తెలిపారు. విద్యార్థులకు మెడికల్ కాలేజీ గుడిపేట్‌లో ఉంటే ఆసుపత్రి జిల్లా కేంద్రంలో ఉన్నందున10 కిలోమీటర్ల ప్రయాణం కోసం రవాణా సౌకర్యంలో భాగంగా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


నర్సయ్య(ఫైల్)

మందమర్రిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాష్ట్రీయ రహదారి బురదగూడెం మదర్సా రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వొల్లపు నర్సయ్య (45) మృతిచెందాడు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం వెంకటేష్ అతని తండ్రి నర్సయ్య బొక్కల గుట్ట నుంచి మందమర్రికి బైక్‌పై వెళ్తున్నారు. మదర్సా వద్దకు చేరుకోగానే రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన ఆటో ట్రాలీ బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే నర్సయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేష్ చికిత్స పొందుతున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళకు గాయాలు


గాయపడిన మహిళ

హాజీపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. దండేపల్లి మండలంలోని వెల్గటూర్‌కు చెందిన బోరె శ్రీనివాస్ తన అక్క గుమ్ముల రజితను తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని లక్షెట్టిపేట వైపు నుంచి మంచిర్యాల వెళుతున్నాడు. అదే వైపు వెళుతున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో రజితకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు పింఛన్ ఇవ్వాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రభుత్వం దివ్యాంగ పెన్షన్‌లను మంజూరు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 300 మంది తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అన్నారు. వీరందరికి వికలాంగుల పెన్షన్ ఇవ్వాలన్నారు. సదరం క్యాంపులను రెగ్యులర్‌గా నిర్వహించాలని, అదే విధంగా వ్యాధిగ్రస్తులకు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్య, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులకు రక్తం ఎక్కిస్తూ మెరుగైన వైద్యానికి అందించాలన్నారు. తలసేమియా, సికిల్ వ్యాధిగ్రస్తుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తలసేమియా, సికిల్ వ్యాధిగ్రస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ ఉద్యమ సెగ తగలాలి


ధర్మపోరాట దీక్షలో పాల్గొన్న బీసీ జేఏసీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ ఉద్యమ సెగ తగలాలని బీసీ జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మపోరాట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం చైర్మన్ రూప్‌నార్ రమేష్ మాట్లాడుతూ ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ ఉద్యమ సెగ తగలాలని, సీఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్లాలని డిమాండ్ చేశారు. వారికి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ప్రణయ్, జక్కన్న, రమేష్, మేరాజ్, మారుతి, రవీం దర్, అశోక్, మోరేశ్వర్, శంకర్, శంకర్, ప్రశాంత్, జయరాం, మెంగాజీ, లహుకుమార్, శ్యాంరావు, సాయికృష్ణ, నాందేవ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితం.. రవాణా భారం


ఆసిఫాబాద్ నుంచి ఇసుక తీసుకువస్తున్న ట్రాక్టర్

● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన

జైనూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోంది. అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.కానీ ఆ ఇసుకను ఇంటికి తీసుకొచ్చేందుకు రవాణా చార్జీల భారం పడుతోందని లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, ఇటుక, సిమెంటు ధరలు పెరుగడంతో ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలు దాటుతుందని, అదనపు భారం పడుతున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు.

● ఏజెన్సీ మండలాల్లో

జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఇసుక సదుపాయం లేక పోవడంతో ఆసిఫాబాద్, చిర్రకుంటల క్వారీల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా చేసుకోవాలని అధికా రులు ఆదేశాలు జారీ చేశారు. అక్కడి నుంచి ఇసుకను జైనూర్,లింగాపూర్, సిర్పూర్(యు), కెర మెరి, తిర్యాణి, మండలాల్లోని గ్రామాలకు తీసుకు రావడానికి లబ్ధిదారు లపై రవాణా భారం పడుతోంది. ఒక్కో ఇంటికి ఎనిమిది నుంచి 10 ట్రాక్టర్ల ఇసుక ఇచ్చేందుకు అనుమ తులు ఉన్నాయి. ట్రాక్టర్ కూలీల రవాణా ఖర్చులు లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. ఆసిఫాబాద్, చిర్రకుంటల నుంచి ఈ మండలాల్లోని ఆయా గ్రామాల వరకు 70 నుంచి 90 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఒక్కొక్క ట్రాక్టర్ రవాణాకు రు. 7,500 నుంచి 9000 వరకు నగదును చెల్లించాల్సి వస్తున్నది. మొత్తం ఇసుకకే రూ. 60 వేల నుంచి 90 వేల వరకు లబ్ధిదారులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. పథకం కింద ఇసుక రవాణాకు కేవలం ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు.

పెద్ద వాహనాలకు (లారీలు) అను మతు లు ఇస్తే ఒకే సారి నాలుగు, ఐదు ట్రాక్టర్ల మేర ఇసుక ఇంటికి వచ్చే ఆవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. ట్రాక్టర్లతోనే ఇసు కను తీసుకొస్తే ప్రభు త్వం ఇచ్చే డబ్బులు సరిపోయే పరిస్థితి లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇళ్ల పనులు ఆలస్యమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రవాణా భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

రేపు ప్రత్యేక లోక్ అదాలత్

ఆసిఫాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గన కేసులు పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్ కాంపౌండబుల్, ఎన్‌ఐ యాక్ట్, కుటుంబ కలహాలు, వాహన ప్రమాదాలు, సివిల్, బ్యాంకు రికవరీ ఇతర కేసులకు సంబంధిచినవి రాజీమార్గాన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పోస్టర్ల విడుదల

జైనూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే చలో కలెక్టరేట్ పోస్టర్లను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడావి గణపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంర చిన్ను, ఆత్రం జైతు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామ పంచాయతీ తేలిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. ఆహారం తయారీ సమయంలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలని సూచించారు. అనారోగ్యం బారిన పడకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, ఆయన సూచించారు. తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించి అధికా రులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారు లకు ఇళ్ల నిర్మాణ పనులను వేగవం తం చేయాలని చెప్పారు. నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాన కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పనులు ఆటంకం లేకుండా కొనసాగుతాయని అన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసుకుంటే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం అందజేస్తేన్న డబ్బులు వారి ఖాతాల్లో పడుతాయని చెప్పారు. స్థానిక అధికారులు ఇళ్ల పనులను పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సూచనలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను పాఠశాలకు పంపించాలి

లింగాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు తప్పనిసిరగా పంపించాలని మండల విద్యాధికారి యం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గైర్హజరు కాకుండా ఉపాధ్యాయులు చర్యలు తసుకుంటున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు బడికి వచ్చేలా పర్యవేక్షించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదవి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథా లయంలో శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న ప్రారంభోత్సవం, 15న పుస్తక ప్రదర్శన చిత్రలేఖనం, 16న వక్తృత్వ పోటీలు, కవి సమ్మేళనం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 17న వ్యాసరచన ధ్యాన, మెడిటేషన్, 18న వ్యాసరచన పోటీలు, ముగ్గుల పోటీలు, 19న ముగింపు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైనూరు కేజీబీవీ పాఠశాలలో కాంట్రాక్టు పద్దతిపై ఏఎన్‌ఎం పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈఓ దీపక్ తివారి గురువారొ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 18వ తేదీ లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శ్రావణి కుటుంబానికి అండగా ఉంటాం


శ్రావణి కుటుంబ సభ్యులకు ఉత్తర్వు కాపీ అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో అక్టోబరు 18న హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ వహిదుద్దీన్‌లతో కలిసి శ్రావణి కుటుంట సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు, ఇంటి నిర్మాణానికి మహిళా సమాఖ్య నుంచి లక్ష రూపాయల రుణం చెక్కు, అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించే ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హత్యకు గురైన శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. శ్రావణి తండ్రి చెన్నయ్య పేరిట ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేశామని అన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి మండల సమాఖ్య నుంచి లక్ష రూపాయల రుణం చెక్కును అందిస్తున్నామని అన్నారు. మొదటి విడతగా రూ.4.12 లక్షలు మంజూరు ఉత్తర్వులను అందజేశామని తెలిపారు. శ్రావణి తండ్రి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామని అన్నారు. శ్రావణి కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరులకు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన వాటిని అందజేస్తున్నామని శ్రావణి తల్లిదండ్రులకు ఉపాధి నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వంలో ఏదైనా దుకాణం పెట్టుకునేందుకు చర్య లు తీసుకుంటామని అన్నారు. శ్రావణి తుమ్మడిని గురుకుల పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శ్రావణిని హత్య చేసిన వారికి కఠిన శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రక్షణ పరంగా శ్రావణి కుటుంబానికి పోలీసుశాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, దహెగాం తహసీల్దార్ షరీఫ్, ఎంపీడీవో నస్రుల్లా, ఎస్సై విక్రమ్, శ్రావణి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు వెలికితీయాలి


మందమర్రిలో మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగులు, అధికారులు అనే తేడా లేకుండా నాణ్యమైన బొగ్గు వెలికితీయాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక జీఎం కార్యాల యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా పరిశ్రమలతో చేసుకున్న బొగ్గు ఒప్పందాల ప్రకారం నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలన్నారు. అలాగే మార్కెట్‌లో ఇంటికి సంబంధించి నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేస్తామో అదే తరహాలో ఇతరులు మన బొగ్గు నాణ్యతగా ఉంటే ఎంత ధర అయినా పెట్టడానికి వెనకాడబోరన్నారు. సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు బొగ్గు నాణ్యత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాల న్నారు. సింగరేణికి బొగ్గుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండాలంటే అది నాణ్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా బొగ్గు నాణ్యత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంవోఏఐ జాయింట్ సెక్రటరీ రవి, ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ ఆసిఫ్, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, సీనియర్ పీవో శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని ప్రతి గనిలో నాణ్యమైన బొగ్గును వెలికితీ యాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో ఆయన పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఉద్యోగులతో బొగ్గు నాణ్యత ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథిగా బెల్లంపల్లి రీజియన్ జీఎం(క్వాలిటీ) వీరభద్రరావు హాజరయ్యారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బొగ్గు నాణ్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు, క్వాలిటీ ఇన్‌చార్జి మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, డీజీఎంలు అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, హరినా రాయణ, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, లా అధికారి మల్లేష్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, కంట్రోల్ అధికారి అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ పీవో సురేందర్, ఐటీ అధికారి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ద్వారానే సంస్థ మను గడ సాధ్యమని ఐకే ఓసీపీ, ఐకే 1ఏ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి అన్నారు. బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా గురువారం ఇందారం ఉపరితల గని ప్రాంగణంలో ఉద్యోగులు, అధికారుల సమక్షంలో జెండా ఆవిష్క రించారు. ఉద్యోగుల చేత నాణ్యత ప్రమాణం చేయిం చారు. కార్యక్రమంలో ప్రాజెక్టుమేనేజర్ నాగయ్య, ఐకే ఓసీపీ మేనేజర్ శంకర్, ఐకే 1ఏ మేనేజర్ కోటయ్య, రక్షణాధికారి మహేష్, సంక్షేమాధికారి రమేష్, ఐకే ఓసీ పీ ఇన్‌చార్జీ క్వాలిటీలు కిరణ్, చంద్రశేఖర్, పిట్ కార్యదర్శి శ్రీకాంత్ , నవీన్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడంలో ప్రతి ఒక్కరూ పూర్తి నిబద్ధతతో పని చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం కైరిగూడ ఉపరితల గని ఆవరణలో జరిగిన బొగ్గు నాణ్యత వార్సోతవాలు-2025 కార్యక్రమంలో పాల్గొని నాణ్యత పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం అందరు నాణ్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ నరేందర్, ఇంజనీర్ వీరన్న, శంకర్, ఏఐటీయూసీ నాయకులు శేషు, క్వాలిటీ ఇన్‌చార్జి రాజేష్‌బాబు, పాల్గొన్నారు. నాణ్యత వారోత్సవాలను పురస్కరించుకుని జీఎం కార్యా లయం ఆవరణలో వారోత్సవాలను ఆయన జీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మొగిలి, అధికారులు, ఉజ్వల్‌కుమార్ బెహారా, ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, క్వాలిటీ హెచ్‌ఓడీ రాజేష్‌బాబు, పర్సనల్ హెచ్‌ఓడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.


శ్రీరాంపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది


రెబ్బెనలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి


జైపూర్‌లో బొగ్గు నాణ్యత ప్రమాణం చేస్తున్న ఉద్యోగులు

సింగరేణి సమాచారం

ఆర్‌కే 6 గనిని సందర్శించిన అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 6 గనిని రక్షణ అధికారులు గురువారం సందర్శించారు. గని మూసివేస్తున్నందున సంబంధిత పనులు సక్రమంగా జరుగుతున్నాయా అని హైదరాబాద్ రీజియన్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎన్. నాగేశ్వర రావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(సర్వే) శ్రీనివాస శర్మ పరిశీలించారు. రక్షణ గోడలు సురక్షితంగా నిర్మించారా అని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గనిలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్దుబాటు, గనిలోని యంత్ర సామగ్రి గురించి ప్రశ్నించారు. అనంతరం భూగర్భంలోకి వెళ్లి రక్షణ గోడలను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ శ్రీధర్, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, ఏరియా క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య, గని ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు అందజేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు సక్రమంగా నడిచేందుకు, విద్యు త్ ఉత్పత్తి అయ్యేందుకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేసి వినియోగదారుల మన్ననలు పొందాలని ఆర్‌కే 7 గని మేనేజర్ తిరుపతి అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 7 గనిలో బొగ్గు నాణ్యత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గని మేనేజర్ తిరుపతి జెండా ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్ర మంలో రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ కార్యదర్శి మారేపల్లి సారయ్య, వెంటిలేషన్ అధికారి జగదీష్, పిట్ ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రాము, రవీందర్, రవితేజ, సంక్షేమాధికారి సంతన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతీ రోజు డ్యూటీకి రావాలి

శ్రీరాంపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రతీ రోజు డ్యూటీకి రావాలని శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్టు అధికారి సీహెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. ఓసీపీలో పనిచేస్తూ 2022, 2023, 2024, 2025 సంవత్సరాలలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు గురువారం గని కార్యాలయంలో ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్, రక్షణాధికారి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఏసీపీ ఆర్ ప్రకాష్

మంచిర్యాల క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుతారని ఏసీపీ ప్రకాష్ అన్నారు. మంచిర్యాల కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దీని కోసం మంచిర్యాల జిల్లాలో షీటీం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా, ట్రాఫిక్ నియమాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, టీ సేఫ్ యాప్, షీటీములపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఎస్సైలు ఉషారాణి, హైమా, కానిస్టేబుల్ శ్రీలత, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు

మందమర్రిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సతీష్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మందమర్రి మండలంలోని రామకృష్ణపూర్ పరిధిలోని అసైన్డ్ భూముల్లో వెంచర్లు వేస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వ అనుమతులు లేని ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయవద్దన్నారు. ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి విక్రయిస్తే వారిపై చర్యలుంటాయన్నారు.

'ప్రిన్సిపాల్‌పై దాడి అమానుషం'

మంచిర్యాల క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌పై విద్యార్థి నాయకులు దాడి చేయడం అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ట్రస్మా మంచిర్యాల జిల్లా కోశాధికారి ఉదారిచంద్రమోహన్ గౌడ్ అన్నారు. వరంగల్ జిల్లాలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్సిపాల్‌పై చేసిన దాడిని ఖండిస్తూ ట్రస్మా ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండాచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వారిపై చర్యలు తీసుకోని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు విష్ణువర్ధన్‌రావు, కస్తూరి పద్మచరణ్, బాలాజీ పాల్గొన్నారు.

'పాలకవర్గ విధానాలతో ప్రజలకు ఇక్కట్లు'

మందమర్రిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు శాపంగా మారుతున్నాయని, ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం రామకృష్ణపూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల కోసం పోరాటలు చేసిన పార్టీ తమపార్టీయేనని తెలిపారు. నిజాం నవాబుల కాలం నుంచి పీడిత ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేసిన పార్టీ తమదేనన్నారు. తమ పార్టీ వందేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ముగింపు సభ డిసెంబరు 26న ఖమ్మంలో జరుగుతుందన్నారు. కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ నుంచి ఈ నెల 15న బస్సు యాత్ర ప్రారంభవుతుందని తెలిపారు. ఈ యాత్రకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, కలవేన శంకర్, మారుపాక అనిల్‌కుమార్, మణికంఠరెడ్డి, ఇప్పకాయల లింగయ్య, లక్ష్మణ్, వనం సత్య నారాయణ, గోపి,దేవానంద్, శంకర్, మురళీ పాల్గొన్నారు.



అందరూ చదవాలి..రాయాలి..

- సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ లక్ష్యం
- కొనసాగుతున్న 'అమ్మకు అక్షరమాల' శిక్షణ

కోటపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వయోజనులు ప్రతీ ఒక్కరు చదవడం, రాయడమే లక్ష్యంగా ఉల్లాస్ కొనసాగుతోంది. ప్రతీ ఒక్కరు విద్యాజ్ఞానం కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఉల్లాస్ పథకంలో భాగంగా వయోజన విద్యాశాఖ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది. నవ భారత్ సహకారంతో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా, డీఆర్ డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళ సంఘాల్లోని నిరక్షరాస్యులు,మ ధ్యలో బడి మానేసిన వారిని గుర్తిం చారు. జిల్లాలో 15 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యలో 30,636 మంది నిరక్షరాస్యులుగా ఉన్నట్లు నివేదిక సి ద్ధం చేశారు. వీరికి అక్షరాలు నేర్పేందుకు వలంటీర్లను ఎంపిక చేసి మండలాల వారీగా శిక్షణ సైతం ఇచ్చారు. 3064 మంది వలంటీర్లను ఎంపిక చేసిన అధికారులు విధి విధానాలను వారికి శిక్షణలో వివరించారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఇద్దరు రీసోర్స్ పర్సన్‌లు, ఒక ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చారు. సామాజిక సాధికారత లో భాగంగా చదువురాని వారికి చదవడం, రాయడం నేర్పించడమే ఉల్లాస్ పథకం ప్రధాన లక్ష్యం. మహిళ సంఘాల్లో ఉన్న సభ్యుల్లో 50 శాతం మంది మాత్రమే సంతకం చేస్తున్నారని, మిగితా వారు వేలిముద్రలు వేస్తున్నారని తేలడంతో వయోజన మహిళలకు చదువు నేర్పుందుకు ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. అంతేకాకుండా మధ్యలో బడి మానేసిన వారిని గుర్తిం చి ఓపెన్ పది, ఓపెన్ ఇంటర్, డిగ్రీ వరకు చదివించ డంతో పాటు వారికి స్కిల్ డెవలప్‌మెంట్ టెక్నికల్ కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు.

వలంటీర్ల ద్వారా బోధన

వయోజనులకు అక్షరాలను నేర్పే బాధ్యత పూర్తిగా వలంటీర్ల పైనే ఆధారపడి ఉంది. స్వచ్ఛందంగా బోధన చేసే వారి వీలు ఆధారంగా మండలంలో ఎంచుకున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకునేలా వెసలుబాటు కల్పించారు. 15 నుంచి 20 మంది చొప్పున గ్రూపు సభ్యులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల్లో అక్షరాస్యులైన వారిని ఎంపిక చేసి వారికి నిరక్షరాస్యుల గ్రూపులను కేటాయించి వారికి చదువు చెప్పించే బాధ్యతను అప్పగించారు. గ్రూపులో ఉన్న సభ్యులకు చదవడం, రాయడం వచ్చే వరకు వలంటీర్లే బాధ్యతగా తీసుకున్నారు. విద్యాశాఖ పుస్తకాలతో పాటు ఉపాధ్యాయుల ద్వారా సహకారం లభిస్తుంది. తల్లి చదవడం ద్వారా ఆ కుటుంబంలో వెలుగు నిం డుతుంది. తద్వారా బడికి వెళ్లే పిల్లల సంఖ్య పెర గడం తో పాటు డ్రాపౌట్‌లు తగ్గి బాల్య వివాహాలపై అవగాహన పెరగనుంది. గ్రామంలో అక్షరాస్యులుంటే అన్ని రంగాల్లో అభివృద్ధిలో పయనించేందుకు దోహద పడు తుందనే లక్ష్యమే ఉల్లాస్‌లో నిక్షిప్తమై ఉంది.

అమ్మకు అక్షరమాల

గ్రూపు సభ్యుల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉల్లాస్ కార్యక్రమంలో అమ్మకు అక్షర మాల అనే కార్యక్రమాన్ని జిల్లా వయోజన శాఖ ఆధ్వ ర్యంలో ప్రారంభించారు. ఇందుకు సంబంధించి గ్రామైక్య సంఘాల మహిళలకు, ఓబీలకు మండలాల వారీ గా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామసంఘం నుంచి ఇద్దరు ఓబీలకు, వీవోఏలకు, సీఆర్‌పీలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా వారు అక్షర కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షరజ్ఞానం పెంపొందించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- పురుషోత్తం నాయక్, వయోజన విద్యా ప్రాజెక్టు డైరెక్టర్



మహిళ సంఘాల్లోని నిరక్షరాస్యుల వివరాలను సేక రించాం. ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను అక్షరా స్యులుగా మార్చే ఉల్లాస్ పథకం మంచి అవకాశం కల్పిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని నిరక్షరాస్యులైన మహిళలందరు సద్వినియోగం చేసుకుని అక్షరాస్యులుగా మారాలి.

ప్రకృతి వనంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

చెన్నూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో నిర్వహిస్తున్న శీతాకాలం శిబిరంలో భాగంగా మూడవ రోజు గురువారం శివలింగాపూర్‌లోని ప్రకృతి వనంలో ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా, చెదారం, ముళ్లపొదలను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్‌పాషా మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిరాజుద్దీన్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకృతి వనంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

16న తెలంగాణ జన సమితి ప్లీనరీ

శ్రీరాంపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న తెలంగాణ జన సమితి ప్లీనరీ నిర్వహించనున్నట్లు మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు సమ్ము రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ ఎదుట ఉన్న సుచిత్ర ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా 2018, ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితి ఆవిర్భవించిందని తెలిపారు. జిల్లా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. తాగు, సాగునీరు సమస్యలను పరిష్కరించేందుకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించి గ్రావి టీ ద్వారా అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలనే ఎజెండాతో ముందుకు పోతున్నట్లు చెప్పారు. సింగరేణిని కాపాడేందుకు తాము పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. తాము అనుక్షణం రైతాంగానికి అండగా ఉంటామన్నారు. సామాజిక తెలంగాణ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు ఒక కీలక అడుగు అన్నారు. ఎంఎల్‌సీ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో సమకాలీన సమస్యలపై ప్లీనరీలో చర్చ జరుగుతుందన్నారు. కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నర్సరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

వేమనపల్లి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో కుమారస్వామి ఆదేశించారు. గురువారం వేమనపల్లి మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ చేయాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు వందశాతం ఆధార్‌సీడింగ్ చేయాలని సూచించారు. ఇంటి పన్నును, ట్రేడ్ లైసెన్స్‌లను రీనివల్ చేయించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కార్యదర్శులు కృషిచేయాలని తెలిపారు. ఎంపీవో వెంకటేశ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

గురుకుల విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ తిరుపతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జాయింట్ సెక్రెటరీ

లక్సెట్టిపేట, నవంబరు, 13(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమిని గెలుపునకు నాంధీ అని గురుకుల విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ జి.తిరుపతి అన్నారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలేలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్14, అండర్19 క్రీడా పోటీలు గురువారం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యం అన్నారు. క్రీడల వల్ల దేహదారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతే కాకుండా మనం ఉన్నత చదువులు చదివిన తర్వాత క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గమనించాల్సిన విషయం ఏమిటంటే క్రీడల్లో స్నేహపూర్వకంగా ఆడాలని ఓడిపోయామన్న బాధ క్రీడాకారులకు ఉండకూడదని ఓటమి కావడానికి కారణం తెలుసుకుని అది సవరించుకుంటూ మరో సారి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన లక్సెట్టిపేట, జనగాం జట్టు క్రీడాకారులను అభినందించి బహుమతులను అందించారు. ఈకార్యక్రమంలో ఆర్సీవో శ్రీధర్, ప్రిన్సిపల్ మంగ, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ బాగ్యలక్ష్మి, ఏపీటి తిరుపతి, డిప్యూటీ ప్రిన్సిపల్ వాణితో పాటు పీఈటిలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యా పరిరక్షణ కమిటీ కార్యవర్గ సమావేశం

మంచిర్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల విద్యా పరిరక్షణ కమిటీ మంచిర్యాల బాయ్స్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మోతె జయ కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించగా పలు అంశాలపై తీర్మాణాలు చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని, విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని ఖండించారు. ఈ కార్యక్రమంలో నాయకు లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలి

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని కొత్త ఆవిష్కరణలను రూపొందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జిజ్ఞాస సైన్స్ మొబైల్ ప్రయోగశాల ప్రదర్శనకు ఆయన హాజరై మాట్లాడారు. సైన్స్‌లో కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జీవశాస్త్రం వివిధ రకాల సైన్స్ ప్రయో గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సురేష్ బాబు, లచ్చన్న, రాజేష్, పద్మ కుమారి, రమణయ్య, నిర్మల, సులోచన, మహేష్, కృష్ణ, రజిత పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

జైపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న మధులతను గురువారం కార్యాలయంలో అధికారులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ మధులత మరిన్ని పదోన్నతులు పొంది ఉన్నత శిఖరాలను అధిరో హించాలన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, సీనియర్ ఆడిటర్ వెంకటరమణ, సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మీ, జూనియర్ అసిస్టెంట్‌లు తిరుపతి, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, సురేందర్, పావణి, తదితరులు పాల్గొన్నారు.

ఇక పక్కాగా హద్దులు..

(5వ పేజీ తరువాయి)

సంబధించిన సరైన మ్యాపులు అధికారుల వద్ద లేకపోవడం సమస్యగా మారింది. కొన్ని గ్రామాలకు పూర్తిగా నక్షాలే లేవు. భూ పట్టాలు లేని గ్రామాలకు నక్షాలు రూపొందించడంతో పాటు, సర్వే నంబర్ల వారిగా టీపన్‌లు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే నక్షాలు లేని గ్రామాల్లో రిసర్వే నిర్వహించి కమతాల వారిగా హద్దులు నిర్ణయించనున్నారు. సరిహద్దులు పక్కాగా తేల్చేందుకు ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామాల్లో రీసర్వే చేపట్టనున్నారు. జిల్లాలోని చిన్నవెంకటాపూర్, తంగ ళ్లపల్లి, రాంపూర్, కొత్తపల్లి, పుప్పాల్‌వానిపేట, అడ్డ పల్లి, కిష్టంపేట, కవర్ కొత్తపల్లి, పార్‌పెల్లి, మద్దికల్, చెన్నూరు, ఆరెపల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. గ్రామంలోని కొంచెం స్థలం కూడా వదలకుండా డ్రోన్, డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)తో సర్వే చేపట్టనున్నారు. హద్దులు గు ర్తించి గ్రామకంఠం, అటవీ, సర్కారు, దేవాదాయ, సీలింగ్, పడావు తదితర భూములతో పాటు వ్యయ సాయ భూములను సర్వే నంబర్ల వారిగా నక్షా, టిప్పన్ రూపొందిస్తారు.

-కమతాల వారీగా భూధార్‌కార్డులు

కమతాల వారిగా రైతులకు భూధార్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో ఎంజాయ్ మెంట్ సర్వే చేపట్టి కార్డులు ఇవ్వనున్నారు. ఇందుకుగాను ముందుగా జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో భూమి వాస్తవంగా ఎవరి అనుభ వంలో ఉంది ? సర్వే నంబరు, సబ్ డివిజన్ నంబర్ సరైనదేనా ? కాదా ? భూమికి సమీపంలో రోడ్లు, చెట్లు, ఇళ్లు, జలవనరులు ఏ మైనా ఉన్నాయా ? హద్దులు పాత రికార్డులతో సరిపోతున్నాయా ? లేదా ? అనే కోణంలో వివరాలు సేకరిస్తారు. తద్వారా భూమి హక్కుల నిర్ధారణ చేసి, అను భవదారు కాలంలో ఉన్న రైతుల వివరాల ఆధారంగా భూధార్ కార్డులను అందజేయనున్నారు. ఇప్పటికే యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇవ్వాలని కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని భూధార్ ఇస్తారని అధికారులు చెబుతున్నారు.

గ్రామైక్య సంఘాల గాజుల సవ్వడి

దండేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపేటలోని జై హనుమాన్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఫ్రెండ్‌షిప్ గాజుల సవ్వడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం తోట లక్ష్మీ మాట్లాడుతూ మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుని పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించుకుని గాజుల సవ్వడి పండగ చేసుకోవ డంతో పరిచయం పెరుగుతుందన్నారు. సీసీ దేవమ్మ, వీవోఏ గుమ్మడి విమల, అలిశెట్టి సునీత, వీవో అధ్యక్షురాలు పేరం రజిత ఉన్నారు.



గాజుల పండగ చేసుకుంటున్న మహిళలు

బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీలను రిజర్వేషన్‌లను వెంటనే అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకులు డాక్టర్ నీలకంటేశ్వర్‌గౌడ్, ఒడ్డేపల్లి మనోహర్‌లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీసీల ధర్మ పోరాట దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు నిబంధనలకు అనుకూలంగా బీసీ రిజర్వేషన్‌కు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం బీసీలను స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ జీవోను తీసుకుని వచ్చిందని, కానీ కొంత మంది అగ్రకుల నాయకుల సహించలేక తెలంగాణ హైకోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకున్నారన్నారు. బీసీ రిజర్వేషన్‌లకు చట్టబద్దత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో పెట్టి బీసీలకు చట్టబద్దంగా రిజర్వేషన్‌లు అందించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ ప్రజల ఆకాంక్షకలు అనుగుణంగా పోరాటాలకు మద్దతు ఇవ్వాలన్నారు. ఈకార్య క్రమంలో బీసీ జేఏసీ నాయకులు రమణ, రాజన్నయాదవ్, ఎల్లన్న, భాస్కర్, నాగరాజు, రాజేశంగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్, రవి, మారుతి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, వనజ, లక్ష్మీ, శేఖర్, రాంబాబు, గణేష్ పాల్గొన్నారు.



బీసీల ధర్మ పోరాట దీక్షను చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

బీమా చెక్కుల పంపిణీ



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

భీమారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో గురువారం పలువురికి బీమా చెక్కులను బ్యాంకు కార్యనిర్వహణ అధికారి సుబ్బారెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ కిష్టంపేటకు చెందిన గుండేటి రాజుబాయి ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకంలో రూ. 436తో బీమా చేయించుకోగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నామిని అయిన ఆమె తల్లి గుండేటి మల్లక్కలకు రూ. 2 లక్షల చెక్కును అందించామన్నారు. అలాగే భీమారం మండలానికి చెందిన ఆవుల ఓదెలు ఇటీవల మరణించగా నామినిగా ఉన్న అతడి భార్య ఆవుల పద్మకు రూ. 2 లక్షల చెక్కును అందించామన్నారు. ఖాతాదారు లందరు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రామచంద్ర, సతీష్‌కుమార్, తేజస్వి, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

తాండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని విద్యాభారతి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం అండర్ 14,17 బాల బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో నుంచి 20 మంది ఈ నెల 15,16,17 తేదీల్లో జగిత్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరెస్పాండెంట్, డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలకు అతిథిగా హాజరైన ఎంఈవో మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకూబ్, పాఠశాల అకాడమిక్‌డైరెక్టర్ సురభి సౌమ్య, ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, పీడీలు బాలకృష్ణ, రాజలింగం, తారకేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



చదరంగం పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

పారిశుధ్య పనులను ప్రతీ రోజు చేపట్టాలి

మందమర్రిరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ప్రతి రోజు చేపట్టాలని ఎంపీవో సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం వెంకటాపూర్, పొన్నారం, శంకర్‌పల్లి గ్రామాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు షెడ్‌లో ఎరువులు తయారు చేయాలన్నారు. గ్రామాల్లోని రోడ్లపై చెత్తా, చెదారం, ప్లాస్టిక్ లేకుండా చూడా లన్నారు. పంచాయతీ రికార్డులను ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. వందశాతం పన్నులను వసూలు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

లక్ష్మణ్ మృతి పార్టీకి తీరని లోటు

కాసిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కల్వల లక్ష్మణ్ మృతి పార్టీకి తీరని లోటని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం సోమగూడెంలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. లక్ష్మణ్ సింగరేణిలో పని చేసినప్పుడు ఏఐటీయూసీ యూనియన్‌లో సైతం క్రియాశీలకంగా పనిచేశాడన్నారు. కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశాడని తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి ఎండీ అక్బర్ ఆలీ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి మల్లేష్, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో యూనిట్-1 షట్‌డౌన్

జైపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్ యూనిట్ 1 గురువారం షట్‌డౌన్ అయ్యింది. యూనిట్ -1 (600 మెగావాట్లు) ప్లాంట్‌లోని బాయిలర్ల ట్యూబుల్లో లీకేజీలతో విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. యూనిట్ 2లో ఉత్పత్తి కొనసాగుతుందని యూనిట్ 1లో మరమ్మత్తు పనులు చేపడుతున్నామని త్వరలోనే యూనిట్ 1లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

- ఇంటర్వ్యూలకే పరిమితమైన పథకం
- పరిశీలన పూర్తయినా నిరుద్యోగులకు తప్పని నిరీక్షణ
- జిల్లాలో 29,756 మంది దరఖాస్తులు
- స్పష్టత ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం

రాజీవ్ యువ వికాసం ఇచ్చేదెన్నడు?


వాంకిడిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

వాంకిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై నీలినీడలు కమ్ముకు న్నాయి. పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూ ఎస్, మైనార్టీలకు రూ. 50 వేల నుంచి మొదలు కుని రూ. 4 లక్షల వరకు వివిధ రకాల యూనిట్లు కొనుగోలుకు బ్యాంకు లింకేజీతో కూడిన రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ. 50 వేల యూనిట్‌కు వందశాతం సబ్సిడీ, రూ. లక్ష నుంచి 2 లక్షల రుణాలకు 80 శాతం సబ్సిడీ, రూ. 2 లక్షల నుంచి 4 లక్షల వరకు యూనిట్‌లకు 70 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందు కోసం రేషన్‌కార్డు కాలిగిన నిరుపేద కుటుంబం లోని ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ లోను దరఖాస్తులు స్వీకరించారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందాలను కున్న యువత ఆశలు ఆవిరవుతున్నాయి. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రా యితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెన క్కి తీసుకుంది. అప్పటి నుంచి దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధి కారులను కలుస్తూ పథకంపై ఆరా తీస్తున్నారు.

● ప్రభుత్వ సూచన మేరకు..

ప్రభుత్వ సూచన మేరకు యువ వికాసం పథ కానికి జిల్లాలోని నిరుద్యోగ యువత దరఖా ్స్తులు చేసుకున్నారు. జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగులు 29,756 మంది దరఖాస్తులు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం మండలా ల వారీగా రుణ లక్ష్యాలను ఖరారు చేశారు. దీంతో పాటు అధికారులు దరఖాస్తు దారులకు సంబం . దిత బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇం దుకు అనుగుణంగా ఈ పథకా న్ని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున జూన్ 2 ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసింది కానీ నేటికీ పథకం అమలుకు నోచు కోలేదు. నెలలు గడుస్తున్నా ప్రభు త్వం నుంచి యువవికాసం అమ లుపై ఎలాంటి స్పష్టత రాకో వడంతో దరఖాస్తుదా రుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ పథకం అమలు చేస్తారా అన్న విష యంపై నిరుద్యోగులు ఆందోళన చెందుతు న్నారు. కాగా గత ప్రభుత్వం హయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు జిల్లా లో వేలాది మంది దరఖాస్తు చేసు కున్నారు. వీరిలో చాలా మందికి రుణాలు మంజూరైనా ఆర్థిక శాఖ లో పెండింగ్ కారణంగా వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ఆ దరఖాస్తు_దా రులకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో పాత రుణాలందక, యువ వికాసానికి అవకాశం లేక నష్టపోయారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలాల వారీగా దరఖాస్తులు ఇలా..

ఆసిఫాబాద్	3,040
వాంకిడి	1,074
తిర్యాణి	1,690
సిర్పూర్(యూ)	893
రెబ్బెన	2,827
సిర్పూర్(టి)	1,616
పెంచికల్‌పేట్	1,072
లింగాపూర్	793
కౌటాల	2,327
కెరమెరి	1,761
కాగజ్‌నగర్	5,486
జైనూర్	1,860
దహెగాం	1,622
చింతలమానెపెల్లి	1,907
బెజ్జూర్	1,788
మొత్తం	29,756

ప్రభుత్వ తీరు సరికాదు..



- అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తా మని యువ వికాసం పేరిట రుణాలు అందిస్తా మని చెప్పి ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేయ డం సరైంది కాదు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రభుత్వం యువ వికాసం పథకం ఊసెత్తడంలేదు. దరఖాస్తు చేసుకున్న యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించిన ప్రభుత్వం పథకం అ మలు చేయడంపై నిర్లక్ష్యం వహిస్తుండడంతో దర ఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్ప టికైనా రుణాలు అందించి యువతకు ఉపాధి కల్పించాలి.

స్టేషనరీ దుకాణం ఏర్పాటుకు..

- ఇటన్‌కార్ తిరుపతి, దరఖాస్తుదారుడు



రాజీవ్ యువ వికాసం పథకంలో స్టేషనరీ కో సం దరఖాస్తు చేసుకున్నా. జూన్ 2 నుంచి రుణా లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఎంతో ఆశపడ్డాను. ఇంటర్వ్యూలు నిర్వహించి నెలలు గడుస్తున్నా అమలు చేయడంలేదు. ఈ పథకం కోసం అధికారులను ఎవరిని అడిగినా పైనుంచి ఏమి రాలేదని చెప్తున్నారు. డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాను. ప్రభుత్వం యువతకు పథకాన్ని అమలు చేసి ర ణాలు అందిస్తే ఉపాధి పొందుతాం.

అర్హులను గుర్తించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద ఎల్‌పీజీ గ్యాస్ లబ్ధిదారులను అర్హులను గుర్తించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి ప్రధాన మంత్రి ఉజ్వల పథకంపై పౌరసరఫరాల శాఖాధికారులు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా, వయవసాయ, మత్స్యశాఖాధికారులు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద పేద వారికి ఉచితంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను అందిస్తుందని అన్నారు. అర్హులైన వారిని గుర్తించడంలో సంబంధిత శాఖాధికారులు విస్తృతంగా అవగాహన పర్చాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల సభ్యుల ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉజ్వల సిలిండర్ అనర్హుల చేతిలో ఉంటే సమగ్ర విచారణ జరిపి తొలగించాలని ఆదేశించారు. ఆదాయం, భూ విస్తీర్ణం, వాహనాలు కలిగిన యజమానుల వివరాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖాధికారి వసంతలక్ష్మి, రవాణా అధికారి రాంచందర్, వ్యవసాయాధికారి వెంకటి, మత్స్య శాఖాధికారి సాంబశివరావు, తహసీల్దార్‌లు, ఎంపీడీవో లు, హిందు స్థాన్, భారత్ పెట్రోలియం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

సిర్పూర్(టి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐఈఓ రాందాస్ అన్నారు. గురువారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సిలబస్, బోధన, రాబోయే వార్షిక పరీక్షల సంసిద్ధత, మెరుగైన ఫలితాల సాధనపై సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాల న్నారు. విద్యార్థులు ప్రతి రోజు సమయానికి హాజరై పాఠ్యాంశాలపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. లక్ష్య సాధనకు చదువుపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంట్రాక్టు కార్మికుడు మృతి

తిర్యాణి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండల విద్యుత్ శాఖలో మంగి పీడర్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న పర్చాకి మారుతి(38) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మారుతి గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లాడు. ఇంటికి రాకపోకడంతో భార్య విజయలక్ష్మి వెళ్లి చూడగా మార్గమధ్యలో పడిపోయి ఉన్నాడు. 108కు సమాచారం అందించి తిర్యాణి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. అప్పటికే మారుతి మృతి చెందినట్లు డాక్టర్ కృష్ణ తెలిపారు.

జాతరకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కౌటాల మం డల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే జాతరకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, రాజేశ్వర్‌రావు, శ్రీధర్, విలాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కృత్రిమ మేధ, సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ లిటరసీ మీద అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆసిఫాబాద్ డివిజన్‌లోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్యాంసుందర్, శ్రీనాథ్, రవికుమార్, రాజనర్సు, బాబు, ప్రిన్సిపాల్ మహేశ్వర్ పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

వాంకిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని కొలం గిరిజనులకు పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని గురువారం ఎంపీడీవో జోత్స్నకు కొలాం సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుచిజీ అన్నిగా మాట్లాడుతూ వాంకిడి మండలంలో 35 కొలాం గిరిజన గ్రామాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రతి కోలాం కుటుంబంలో ఒకరికి పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించిందన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారు తప్ప పీఎం జన్‌మన్ పథకం కింద నిరుపేద కొలాం గిరిజనులకు మంజూరు చేయడం లేదన్నారు. మండలంలో సర్వే నిర్వహించి ప్రతి కొలాం కుటుంబంలో ఒకరికి పీ ఎం జన్‌మన్ పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లింగు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం ఈ నెల 23న నిర్వహించనున్న ఆదివాసీ ధర్మ యుద్ధం (9 తెగల) చలో ఉట్నూరు మహాసభ పోస్టర్లను ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్ర మంలో నాయకులు దుర్గు, బుర్స పోచయ్య, పుష్పారాణి, దాదేరావు, బాబురావు, విజయ్, ప్రభాకర్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

తొలగింపు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

జైనూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల తలగింపు ఉత_ర్వులను వెంటను ఉప సంహరించుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సం ఘం మండల అధ్యక్షులు రాథోడ్ రవీందర్ కోరారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యా వనరుల కేంద్రంలో గురువారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పవార్ తుకారాం, రవిందర్, గంగు, విమల, రాజమ్మ, మరియమ్మ, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బెజ్జూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో గురువారం ఐరిక్స్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్య తపై టీం సభ్యులు రాజబాబు, శేఖర్, మల్లేష్ అవగాహన కల్పిం చారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐరిక్స్ మేనేజర్ శివకృష్ణ, పీసీ కాంత పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

బెజ్జూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపన్న పేట గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గురువా రం పలు గ్రామాల ప్రజలు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కు వినతి పత్రం అందజేశారు. సలుగుపల్లి- పెంచికలపేట మధ్య రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. కార్యక్రమంలో సకారాం, అమీ రుద్దీన్, హనుమంతు, శ్రీనివాస్, జావీద్ అలీ పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పిస్తాం


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావు

జైనూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) జైనూర్ మార్కెట్ పరిధిలోని జైనూర్, సిర్పూర్(యు), లింగాపూ ర్ మండలాల రైతుల పంటలకు మద్దతు ధర కల్పిం చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మార్కె ట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావు అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం మార్కెట్ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అధ్యక్షతన పాలకవర్గ సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు నిబంధనల ప్రకారం పంటలు తీసుకు రావాలని ఆయన సూచించారు. అనం తరం జిల్లా వ్యవసాయ అధికారి జాడి వెంకటిని పాలకవర్గ సభ్యులు సన్మానిం చారు. సమావేశంలో వైస్ చైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి అస్పక్ హైమద్, డైరెక్టర్లు పంద్ర షేకు, మడావి కృష్ణ, ఆత్రం భుజంగ్‌రావ్, లింగు, విషంరావ్, నీలా బాయి, మార్కెట్ సిబ్బంది మధు, గాయక్‌వాడ్ దత్తు, బబ్లు తది తరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న భక్తులు

కౌటాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై నిర్మించిన శ్రీ రమాసహిత సత్యనారా యణస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురు వారం ఉదయం వైభవం గా నిర్వహించారు. వేద పండితులు ముస్త్యాల రామచంద్ర అవధాని, రాధాకృష్ణ అవధా ని ఆధ్వర్యం లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిం చారు. రమాసహిత సత్యనారా యణ స్వామితో పాటు గరత్మంతుడు విగ్రహాలను మంత్రోచ్చారణ మధ్య ప్రతి ష్ఠించారు. కంకాలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హోమం, సామూహిక సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. 16, 17 తేదీల్లో మహాజాతర జరుగనుంది. ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య దంపతులతో పా టు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాళోజీకి ఘన నివాళి


కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, కాళోజీ నారాయణరావు వర్ధంతిని పురస్క రించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సదానందం మాట్లాడుతూ నిజాం దమననీతికి, నిరంకు శత్వానికి, ఆరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలంతో నిగ్గదీసిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన ఆశ యాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపుని చ్చారు. కార్య క్రమంలో సిబ్బంది సతీదేవి, సలీం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట దెబ్బతిన్నదని పత్తి రైతు ఆత్మహత్యాయత్నం

సిర్పూర్(టి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం వెంపల్లి గ్రామ పంచాయతీకి చెందని మోర్లె రాములు(42) అనే రైతు ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నదని మనస్తాపం చెంది గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాములు మూడు ఎకరాల భూమిలో పత్తి సాగు చేశాడు. అక్టోబరులో కురిసిన వర్షాలకు పూత దశలో ఉన్న పత్తి పంట దెబ్బతిన్నది. దీంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందుతు న్నాడు. గురువారం చేను వద్దకు వెళ్లిన రాములు ప_ురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు పరిస్థితి విషమంగా ఉందని వైద్యు లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, నవం బరు 13 (ఆంధ్రజ్యోతి): జి ల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 20 మంది క్రీడాకా రులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు లింబారావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు మీనారెడ్డి తెలిపారు. శైలజ, చిన్నుబాయి, శరణ్య, శాంతి, ఆదిలక్ష్మి, నంది ని, మైని, మేఘమాల, రాజేశ్వ రి, నాగమణి, అఖల, అక్షిత, సోందేవి, సరస్వతి, మహాలక్ష్మి, లావణ్య, ప్రవళిక, జయశ్రీ, అరుణ, అశ్విని ఎంపికయ్యారు. వీరిని కోచ్ విద్యాసాగర్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఎంసీఎంవో ఉద్ధవ్, క్రీడల అధికారి షేకు, జీసీడీఏవో శకుంతల, ఏటీడీవో శివకృష్ణ, హెచ్ డబ్ల్యూవో సాయిబాబా, అరవింద్, తిరుమల్ తదితరులు గురువారం అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

దహెగాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెం డెంట్‌గా బి.నాగేష్, ఎంపీవో శ్రీనివాస్‌లు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రెబ్బెన మండలం నుంచి నాగేష్ పదోన్నతి పై రాగా గ్రూపు-2 ద్వారా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరిని కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ ఆత్మారాం, ఏపీవో కల్పన, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, టైపిస్టు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ (టి) ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా గ్రూపు-2 ద్వారా ఎంపీఓగా ఎంపికైన వినోద్ గురువారం బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీడీవో సత్యనా రాయణ, కార్యదర్శులు, సిబ్బంది సన్మానిం చి అభినందించారు.

ఉన్ని దుస్తులకు గిరాకీ


కాగజ్‌నగర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉన్ని దుస్తులు

కాగజ్‌నగర్/వాంకిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జిల్లాలో చలి తీవ్రత పెరుగడంతో ఉన్ని దుస్తులను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. చలి పరుగుతుండడంతో వెచ్చని నేస్తాలైన ఉన్ని దుస్తువుల కొనుగోలు కోసం ప్రజలు ఆసక్తి చూప ుతున్నారు. వారం రోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు వణికిపోతున్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులు, ఈదురుగాలులతో క్రమేపి చలి తీవ్రతపై ప్రభావం పెడుతుంది. జిల్లాలో 9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నె లకొంటుంది. అడవులు, గుట్టల ప్రాంతాంలో మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవు తున్నాయి. చల్లని గాలులు వీస్తూ పగలు సైతం చలిపెడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కుంటున్నారు. సాయంత్ర ఆరు గంటల తరువాత బయటకు వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. దూరప్రాంత ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారింది. ఇంట్లో ఉన్నవారు సైతం స్వెటర్లు లేకుండా ఉండలేనంత చలి ప్రతాపం మొదలైంది. చలిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు స్వెటర్లు, దుప్పట్లు, పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. పంజాబ్ నుంచి వీటిని కొనుగోలు చేసి రోడ్లకు ఇరువైపులా బైక్ లపై ఇళ్లవద్దనే విక్రయిస్తున్నారు. కాగజ్‌నగర్‌లో డిల్లీ నుంచి తీసుకొచ్చిన స్వెటర్లు రూ.200 నుంచి రూ.2000 వరకు విక్రయి స్తున్నారు.. చిన్నారులను ఆకర్షించేలా పలుచోటాబీమ్, డోరేమాన్, చిన్‌చాన్, లిటిల్ సింగం తదితర రకాల జంతువుల బొమ్మలతో కూడిన స్వెటర్లు అమ్మకానికి పెట్టారు. స్వెటర్లు విక్రయిస్తున్నారు.